## క్లుప్తంగా

### భక్తి శ్రద్ధలతో పెద్దసరిగెత్తు



శభాష్‌పురంలో ప్రత్యేక అలంకరణలో పీర్లు

**తుగ్గలి :** మొహర్రంలో భాగంగా మండల పరిధిలోని శభాష్‌పురంలో శనివారం పెద్దసరిగెత్తును గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సమస్యాత్మక గ్రామం కావడంతో బందోబస్తు దృష్ట్యా పోలీసులు ఆలస్యంగా మొహర్రం నిర్వహణకు అనుమతులు ఇచ్చారు. పోలీసులు బందోబస్తు మధ్య సరిగెత్తు నిర్వహించారు. భక్తులు పీర్లలకు చక్కెర, పట్టు వస్త్రాలు, వెండి గొడుగులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తప్పెట్లతో పీర్లను గ్రామంలో ఊరేగించారు.

### గాయత్రీ మాత వెండి వడ్డాణం చోరీ

**ఆస్పరి:** మండల కేంద్రం సమీపంలోని రామ తీర్థంలో వెలసిన గాయత్రీమాత ఆలయంలో అమ్మవారి వెండి వడ్డాణం చోరీకి గురైందని ఆలయ నిర్వాహకులు రూపామోహన్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ హనుమంతప్పకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 16న అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం గర్భ గుడికి తాళం వేసి, తాళాలను గుడిలోనే ఉంచి వెళ్లాం. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు తీసుకుని గుడి తలుపులు తెరిచి రూ.70వేల విలువజేసే వెండి వడ్డాణం ఎత్తుకెళ్లారని చెప్పారు. అదే రోజు విషయాన్ని శంకరబండ గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, గ్రామ పెద్దలకు తెలియజేశారన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

### సివిల్ సప్లయీస్ గోదాము తనిఖీ



పత్తికొండలో గోడౌన్ రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

**పత్తికొండ రూరల్ :** పట్టణంలోని సివిల్ సప్లయీస్ గోడౌన్‌ను పత్తికొండ ఆర్డీఓ నీలపు రామలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములోని స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తూకాల్లో ఎలాంటి తేడాలు లేకుండా ఎంఎల్ఎస్ పాయింట్‌కు వచ్చిన సరుకులను రేషన్ షాపులకు సక్రమంగా సరఫరా చేయాలని గోడౌన్ ఇన్‌చార్జ్ నాగమణికి సూచించారు. తహసీల్దారు మాధవరావు, సీఎస్‌డీటీ వెంకటరమణ ఉన్నారు.

### పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

**దేవనకొండ:** పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఈఓపీఆర్డీ సూర్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని నల్లచెలిమల గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందు జాగ్రత్త చర్యగా పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు చెప్పారు. వ్యాధుల పట్ల అవగాహన కలిస్తున్నామని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని ప్రజలకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి రాముడు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

### వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి



మల్లెపల్లెలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

**వెల్దుర్తి(కృష్ణగిరి):** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో డయేరియా, డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మండల నోడల్ అధికారి తులసి ఆదేశించారు. మండలంలోని పుల్లగుమ్మి, మల్లెపల్లె, అల్లుగుండు, గోవర్ధనగిరి గ్రామాల్లో శనివారం తహసీల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ శివశంకరప్పతో కలిసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. తాగునీటి ట్యాంక్‌లను తరచూ శుభ్రం చేయడంతోపాటు లికేజీల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

### అప్రమత్తంగా ఉండండి

**హొళగుంద:** విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తగ ఉండాలని హొళగుంద ట్రాన్స్‌కో ఏఈ ఓబులమ్మ కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ విద్యుత్ తీగలు తెగి పడినా, స్తంభాలు కింద పడినా సమాచారం అందించాలన్నారు.

**తుగ్గలి :** వినియోగదారులు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ మండల ఏఈ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు శనివారం మండలంలో కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో అధికారుల సలహాలు, సూచనలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమస్యలపై టోల్ ఫ్రీ 1912 నంబరుకు ఫోన్‌చేస్తే పరిష్కారం చూపుతామన్నారు.

## కాల్వ.. ఆనవాళ్లేవీ?

**చిప్పగిరి:** మండల కేంద్రంతో పాటు మండలంలోని కాజీపురం, డేగులహాలు, బంటనహాలు, ఏరూరు, నగరడోణ, తిమ్మాపురం రామదుర్గం, బెల్డోణ తదితర గ్రామాలకు సాగు, తాగు నీరు అందించే ఆలూరు బ్రాంచ్ కెనాల్ 12.5 కి.మీ నుంచి 13.5 కి.మీ వరకు ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీంతో కాలువ ఆనవాళ్లు కోల్పోయి ఆ ప్రాంతమంతా చిట్టడవిని తలపిస్తోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వరదలకు తుంగభద్ర జలాశయంలోకి నీరు చేరుతుండటంతో జలాశయం నుంచి హెచ్‌ఎల్‌సీ కెనాల్ ద్వారా ఆలూరు బ్రాంచ్ కెనాల్‌కు నీటి విడుదలకు అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే కెనాల్ శిథిలమవడంతో నీటిని వదిలితే ఎటు వెళ్తాయోనని, తమకు ఫలితం ఉండదని రైతులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా 6,7,8, డిస్ట్రిబ్యూటర్ల కిందనున్న ఆయకట్టు రైతులకు సాగు నీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. నీరు వదిలే లోపు కాలువకు మరమ్మతులు చేసి నీరు ప్రవహించేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.



ఆనవాళ్లు కోల్పోయిన కాల్వ



ఏబీసీ కెనాల్‌లో పెరిగిపోయిన కంప చెట్లు



## ఊట బావి కాదండోయ్!

**ఆలూరు:** ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఊటబావి కాదు.. మురుగు గుంత అంతకన్నా కాదు.. మరేంటంటున్నారా.. ఆలూరులోని ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయ పరిసరాలు. ఎల్లార్తి రోడ్డు సమీపంలోని ఈ కార్యాలయంలో గతంలో ఏఎస్‌డబ్ల్యూఓ విధులు నిర్వహించేవారు. కార్యాలయం నుంచి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, బట్టలు, ప్లేట్లు, గ్లాస్‌లు, మగ్గులు, దుప్పట్లు సబ్బులు, యూనిఫాం పంపిణీ కోసం గోదామును కూడా కార్యాలయానికి అటాచ్‌గా నిర్మించారు. అయితే ఏడాది కిత్రం పత్తికొండను రెవెన్యూ సబ్ డివిజన్‌గా మార్చారు. దీంతో ఈ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లడంతో కార్యాయలం ఖాళీ అయ్యింది. ప్రస్తుతం వర్షపునీరు, కోయినగర్ కాలనీలోని మురుగు నీరంతా కార్యాలయం వైపు మళ్లించారు. ఇక్కడ మురుగు నీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే విషపురుగులకు ఆవాసంగా మారింది. కార్యాలయ సమీపంలో ఏపీ మోడల్ స్కూల్, సమీకృత వసతి గృహం, అగ్నిమాపక శాఖ కార్యాలయం ఉన్నాయి. విద్యార్థులు, ఫైర్ సిబ్బంది కార్యాలయం దాటి వెళ్లడానికి జంకుతున్నారు. కార్యాలయం విషయంపై వివరాలు కోరేందుకు ఏఎస్‌డబ్ల్యూఓ బాబును ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

## నాణ్యత లేని నీటిని సరఫరా చేస్తే ఎలా?

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.నాగేశ్వరరావు, డీపీఓ నాగరాజునాయుడు



పారుశుద్ధ్య పనులు, మంచినీటి సరఫరాపై కాలనీల్లో స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

**ఆలూరు:** వ్యాధుల కాలంలో ప్రజలు అపరిశుభ్రమైన నీరు ఎలా సరఫరా చేస్తారు? పారుశుద్ధ్యం లోపించి అనారోగ్యాల బారిన పడుతున్నా ఎందుకు స్పందించడం లేదు? ఇలాగే వ్యవహరిస్తే వేటు తప్పదని అర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.నాగేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు సంబంధిత అధికారులను హెచ్చరించారు. శనివారం ఆలూరులోని వివిధ కాలనీల్లో నెలకొన్న తాగునీరు, పారుశుద్ధ్య తదితర సమస్యలపై స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అరుణాదేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది హాజరయ్యారు. మూడు వారాలకొకసారి నీరు సరఫరా చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు.. ఇందుకు ఎవరు కారణమని అధికారులు ఆరా తీశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుండటం దారుణమని మండిపడ్డారు. చెత్త, చెదారం పేరుకుపోకుండా డంపింగ్ యార్డుకు తరలించాలని ఇన్‌చార్జ్ పీఎస్ ప్రకాష్‌నాయుడికి సూచించారు. ల్యాబ్ టెస్టింగ్ చేసిన తరువాతే నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. హాలహర్వి మండలం నుంచి అపరిశుభ్రమైన నీరు సరఫరా చేస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య, జేఈలు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు



ఎరువుల డీలర్లతో మాట్లాడుతున్న ఏఓ ఆనంద్ లోకదళ్

**హొళగుంద:** రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ ఆనంద్ లోకదళ్ అగ్రి డీలర్స్‌ను హెచ్చరించారు. శనివారం హొళగుందలో అగ్రి డీలర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ షాపుల్లో స్టాకు వివరాలు, ధరల పట్టిక నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలని, రైతుకు బిల్లులు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. లూజు, నిషేధిత విత్తనాలు అమ్మితే వారి లైసెన్సుల రద్దుకు సిఫారసు చేస్తామని చెప్పారు. ప్రతి డీలరు తమ సేల్స్ రిపోర్ట్‌ను ప్రతి నెల 5వ తేదీలోపు వ్యవసాయ కార్యలయంలో అందజేయాలని స్పష్టం చేశారు.

**కౌలు రైతులకు అవగాహన**

**కృష్ణగిరి:** మండలంలోని ఎరుకలచెరువు గ్రామంలో కౌలు రైతులకు సీసీఆర్ కార్డుల మంజూరుపై మండల వ్యవసాయ అధికారులు శనివారం అవగాహన కల్పించారు. ఏఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కౌలు రైతులు వీఆర్వోలను సంప్రదించి సీసీఆర్ కార్డులు పొందాలన్నారు. ఏఈఓలు, వీపీఏలు పాల్గొన్నారు.

**కౌలు రైతులను త్వరగా గుర్తించండి**

**దేవనకొండ:** మండలంలోని కౌలు రైతులను త్వరగా గుర్తించాలని తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, ఏఓ సురేష్‌బాబు సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కౌలు రైతుల కార్డుల వల్ల భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, దానికి కేవలం 11 నెలలకు మాత్రమే విలువ ఉండే అగ్రిమెంట్ మాత్రమేనని, భూ యజమానులు భయపడాల్సిన పనిలేదన్నారు. కౌలు రైతులకు అగ్రిమెంట్ ఇవ్వొచ్చని, 11 నెలల కాలం దాటిన తర్వాత అగ్రిమెంట్‌కి విలువ ఉండదన్నారు. వీఆర్వోలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలానికి నిర్దేశించిన కౌలు కార్డుల లక్ష్యం సమయంలోగా చేరుకోవాలన్నారు. మండలంలోని వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## సేవలు మృగ్యం



బెల్డోణ సచివాలయంలో విధుల్లో ఒక్కరే..



గ్రామంలోని ప్రధాన రోడ్డు ఇలా..

**చిప్పగిరి:** మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయ సేవలు సక్రమంగా అందక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సందర్భంగా బదిలీ పై వచ్చిన ఉన్నతాధికారులు మళ్లీ బదిలీపై వెళ్తామనే భావనతో గ్రామాలపై పర్యవేక్షణ గాలికొదిలేశారు. దీంతో గ్రామ సచివాలయాల్లో అధిక శాతం సిబ్బంది సమయ పాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. శనివారం మండలంలోని బెల్డోణ సచివాలయంలో మొత్తం ఏడుగురు సిబ్బంది ఉండగా ఉదయం 11 గంటలైనా ఒక్క మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే హాజరయ్యారు. మిగిలిన వారి గురించి ఆరా తీస్తే రోజూ ఇలాగే ఉంటుందని గ్రామస్తులు మండిపడుతున్నారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేసుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

## తీరిన బస్సు కష్టాలు



మార్లమడికికి వచ్చిన ఆర్టీసీ బస్సు వద్ద విద్యార్థులతో డీఎం మహమ్మద్ రఫి, గ్రామస్తులు

**హొళగుంద:** కర్ణాటక సరిహద్దులో ఉన్న మార్లమడికి గ్రామానికి ఆర్టీసీ అధికారులు శనివారం బస్సు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో బస్సులు తిరగక పోవడంతో గ్రామం నుంచి హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాలేజీలకు వెళ్లి రావడానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సు ఏర్పాటు చేయాలని ఇటీవల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రెండు రోజుల క్రితం ఈ మార్గంలో రూట్ క్లియరెన్స్ కోసం వచ్చిన ఆదోని ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫి, అసిస్టెంట్ డీఎం రాంప్రసాద్‌రెడ్డి సమస్య తీవ్రతను గమనించి శనివారం నుంచి గ్రామానికి బస్సు నడిపారు. బస్సు వెంట వచ్చిన డీఎం, అసిస్టెంట్ డీఎంతో కలిసి గ్రామపెద్దలు బస్సుకు పూజలు చేసి రాకపోకలను ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

### కౌలు రైతు ఆత్మహత్యపై కేసు నమోదు

**తుగ్గలి :** కౌలు రైతు ఆత్మహత్యపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎద్దులదొడ్డి గ్రామానికి చెందిన కడివెల్ల రాముడు (44) ఈనెల 18న రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. గతేడాది 5 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని పత్తి, టమాటా పంటలు సాగు చేసి వర్షాభావంతో దిగుబడులు చేతికందక నష్టపోయాడు. కుటుంబ పోషణ, పంట పెట్టుబడులకు చేసిన అప్పులు రూ.6 లక్షలకు చేరాయి. వాటిని తీర్చే మార్గం కనిపించక పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

### మృగాళ్లను శిక్షించాలి

**పత్తికొండ రూరల్ :** నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన మానవ మృగాళ్లను కఠినంగా శిక్షించాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఆస్పరి నరేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

### బకాయిలు సత్వరమే చెల్లించండి

**చిప్పగిరి:** బెల్డోణ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు బకాయిలను సత్వరమే చెల్లించాలని బెల్డోణ సొసైటీ సెక్రెటరీ హరికృష్ణ సూచించారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సొసైటీలో మొత్తం 2,400 మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారని, వారిలో 950 మంది రైతులు వివిధ రుణాలు పొందారని చెప్పారు.

### పెట్టుబడి సాయం అందజేయాలి

**ఆస్పరి:** రైతులు పంటలు సాగు చేసుకునేందుకు వెంటనే పెట్టుబడి సాయం అందజేయాలని, 2023 పంటల బీమా, కౌలు రైతులకు షరతులు లేకుండా బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి జంప్లానాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.20వేలు పెట్టుబడి సాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు.మాణిక్యప్ప, రామాంజనేయులు, రాముడు, రంగస్వామి, నాగరాజు, రంగన్న పాల్గొన్నారు.

### రైతు సమస్యలను తీర్చండి

**ఆలూరు:** భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతుకు కార్డులు మంజూరు చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, సీపీఎం సీనియర్ నాయకుడు నారాయణ స్వామి కోరారు. శనివారం స్థానిక సచివాలయం- 3 కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి అపర్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. 2023కు సంబంధించిన బీమా సొమ్ము రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

### అంగన్‌వాడీలే పిల్లలకు పునాది



టి.గోకులపాడు అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ లూక్

**కృష్ణగిరి:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారానే చిన్నారుల చదువుకు పునాది మొదలవుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ లూక్ అన్నారు. మండలంలోని టి.గోకులపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-1ని శనివారం తనిఖీచేసి పలు రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలను కంటికి రెప్పలా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.అనంతరం చిన్నారులకు విటమిన్ ఏ సిరప్ తాగించారు.

## కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో అశాంతి



ఎమ్మెల్యే విరూపాక్షిని సన్మానంచిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

**ఆలూరు:** అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ చర్యలో రాష్ట్రంలో అశాంతి నెలకొందని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి విమర్శించారు. స్థానిక అతిథి గృహంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించకుండా గొడవలు, పాత కక్షలను రెచ్చగొట్టడంతో దారుణాలు పెరిగిపోతున్నాయని విమర్శించారు. నియోజకవర్గంలో తాగు,సాగు నీరు లేక అనేక గ్రామాల ప్రజలు తల్లడిల్లిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాగు చేసిన పంటలను జింకల బారినుంచి రక్షించుకునేందుకు రైతులు రాత్రింబవళ్లు పొలాల వద్ద కాపలా ఉంటున్నారని చెప్పారు. వేదవతి, నగరడోణ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి, దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు ఆయనను సన్మానించారు. మరకట్టు బీసీ మాదన్న, ఎల్లప్ప, వెంకటేశ్వర్లు, మండల కో-కన్వీనర్ వీరేష్, శివ, రాజు, బాబు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

**ఆలూరు:** గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావించినప్పుడు అధికారులు బాధ్యతగా వ్యవహరిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ రంగమ్మ ఆధ్వర్యంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన ఆలూరులో వివిధ కాలనీవాసులకు సక్రమంగా తాగునీరు అందడం లేదని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవన్నారు. దోమల బెడద తీవ్రంగా ఉందని చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీలకు కనీసం వారానికి ఒక్కసారైనా మంచి నీటిని విడుదల చేయక పోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారని కురుకుంద,ముద్దనగేరి గ్రామాల సర్పంచ్‌లు దేవిరెడ్డి, సుధాకర్‌రెడ్డి ప్రస్తావించారు. ఓహెచ్‌ఆర్ ట్యాంకులను శుభ్రం చేయడంలేదని ఆలూరు ఎంపీటీసీలు బోయ ఎల్లమ్మ, జీరానాగమ్మ, మోతి ఎల్లమ్మ, రమేష్ సభ దృష్టికి తెచ్చారు. ఖరీఫ్ సీజన్ కావడంతో ఆర్‌బీకేల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. గృహాల బిల్లులను హౌసింగ్ సిబ్బంది మంజూరు చేయడంలేదని ఎంపీపీ రంగమ్మ తెలిపారు. ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఆర్ఐ బన్నగౌడు, ఏఓ వెంకటేష్‌గౌడు, ఏపీఓ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

### కౌలు కార్డుపై అవగాహన

**మద్దికెర :** భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసే రైతులకు ప్రభుత్వం కౌలు కార్డు అందజేస్తుందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రవి తెలిపారు. శనివారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో సీసీఆర్‌సీపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు వైపరీత్యాల వల్ల పంటలు చేతికి అందకపోతే కార్డు ఉన్న వారికి పంట నష్టపరిహారం ప్రభుత్వం అందజేస్తుందని, అలాగే పంటలను గిట్టుబాటు ధరలకు అమ్ముకునే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, వీపీఏలు జాకీర్, ఆనంద్ పాల్గొన్నారు.

### కోలుకోలేక వ్యక్తి మృతి



సోమశేఖర ఆచారి

**దేవనకొండ:** పాలకుర్తి గ్రామానికి చెందిన వడ్ల సోమేశ్వర ఆచారి ఈనెల 16న ఆటో (ఏపీ39వీబీ 757)లో తెర్నెకల్ నుంచి గ్రామానికి ఎరువుల సంచులను తరలిస్తుండగా టైరు పేలి ఆటో పల్టీలు కొట్టింది. ప్రమాదంలో సోమేశ్వరాచారి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న వారు క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 27న పంచాయతీ దుకాణాలకు వేలాలు



స్థానిక సంత మార్కెట్‌లో నిర్మించిన దుకాణాలు

**ఆలూరు రూరల్:** స్థానిక సంత మార్కెట్‌లో రూ.1.20 కోట్ల రూర్బన్ నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ బహిరంగ వేలాలను ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఈఓ ప్రకాష్ నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం వేలాలు నిర్వహిస్తామని పాల్గొనే వారు 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రూ.50 వేలు డిపాజిట్, రూ.లక్ష విలువ సాల్వెన్స్ (ఆస్తి విలువ) సర్టిఫికెట్ అందజేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. షాపు నంబర్ 1 నుంచి 10, 17 - 21 దుకాణాలకు రూ.50 వేలు డిపాజిట్, 11 - 16, 22 - 27 షాపుల కోసం రూ.40 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు పంచాయతీకి పన్ను రూపంలో బకాయి ఉండరాదు. డిపాజిట్ చెల్లించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనాలి, మరొక రూముకు వేలం పాడాలంటే మరో డిపాజిట్ చెల్లించాలి. వేలంలో రూమును దక్కించుకున్న వారికి డిపాజిట్ నగదు తిరిగి ఇవ్వబడదని, రూము దక్కించుకున్న వారు మరోసారి వేలాల్లో పాల్గొనరాదని పేర్కొన్నారు. నేషనల్ రూర్బన్ మిషన్ కింద రూ.1.20 కోట్లతో 2019లో 27 షాపుల నిర్మాణాలు చేపట్టి 2020లో పూర్తి చేయగా అనివార్య కారణాలతో నాడు ప్రారంభానికి నోచుకోలేదు.

## చేపల వేలం వాయిదా

- అడ్డుకున్న కొత్తపల్లి, పందికోన గ్రామస్తులు, ఉద్రిక్తత
- ఈనెల 31వ తేదీకి వాయిదా



వేలం వాయిదాను ప్రకటిస్తున్న మత్స్యశాఖ జిల్లా అధికారిణి శ్యామల



కార్యాలయ ఆవరణలో కొత్తపల్లి, పందికోన గ్రామస్తుల ఆందోళన

**పత్తికొండ రూరల్ :** మండలంలోని పందికోన రిజర్వాయర్‌లో ఏడాది కాలం చేపల పెంపకానికి పత్తికొండ మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం వేలం నిర్వహించారు. వివిధ కారణాలతో అధికారులు వేలాలను వాయిదా వేశారు. వేలంలో పాల్గొనే వారి నుంచి నిబంధనల మేరకు రూ.10 వేలు డిపాజిట్ చేయించుకున్నారు. ఇలా 25మంది పాల్గొన్నారు. అయితే ఇన్నాళ్లు రెండు గ్రామాల మధ్యన కుదిరిన ఒప్పందం మేరకు జరిగిన వేలం పాట బహిరంగం కావడంతో వేలం తమకు దక్కదని గ్రహించిన కొందరు కొత్తపల్లి, పందికోన గ్రామస్తులు అక్కడికి చేరుకుని గతంలో నిర్వహించిన విధంగా పందికోన గ్రామంలో వేలం నిర్వహించి ఆనవాయితీ ప్రకారంగానే వేలం సొమ్ములో గ్రామ నాయకులకు 30 శాతం నగదు ఇవ్వాలని లేదంటే వేలం అడ్డుకుంటామంటూ కార్యాలయం వరకు దూసుకొచ్చారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. అప్రమత్తమైన సీఐ మురళీమోహన్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, గోపాల్ పోలీసు సిబ్బందితో ఆందోళనకారులకు నచ్చజెప్పారు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, పత్తికొండ మార్కెట్‌యార్డు కమిటీ మాజీ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకుని గ్రామస్తుల మధ్య సమన్వయం కుదిరేంత వరకు వేలం వాయిదా వేయాలని, లేదంటే రెండు గ్రామాల మధ్యన ఘర్షణ తలెత్తే అవకాశం ఉందని మత్స్యశాఖ అధికారిణి శ్యామలకు తెలిపారు. దీంతో ఆమె మాట్లాడుతూ నిబంధనల ప్రకారం వేలం జరుగుతుందని చెప్పారు. వేలం ద్వారా వచ్చిన నగదులో ఆన్‌లైన్ ప్రకారంగానే గ్రామ పంచాయతీకి చెల్లించబడుతుంది కానీ వ్యక్తిగతంగా ఎవరికీ నగదు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. వేలం గ్రామంలో నిర్వహించడం కుదరదని, ఇక్కడే ఈ నెల 31వ తేదీన మళ్లీ వేలం కొనసాగుతుందని ప్రకటించారు. అనంతరం డిపాజిట్‌దారులకు డిపాజిట్ సొమ్మును వెనక్కు ఇచ్చారు.